నేటి నుంచి ప్రైవేటు కళాశాలల నిరవధిక బంద్

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రైవేటు కళాశాలల నిరవధిక బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రైవేటు కళాశాలల సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నరాములు తెలిపారు. ఆదివారం ఆయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో మేనేజ్మెంట్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అన్ని కళాశాలలు బంద్‌లో పాల్గొనాలని కోరారు. నవంబరు 6న జరిగే లెక్చరర్లు, అధ్యాపకుల బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.






వాచగిరిలో..

ఆలయాల్లో కార్తీక శోభ

వర్గల్/కొమురవెల్లి/జగదేవ్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీమాసంతో పాటు ఆదివారం కావడంతో ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భక్తులు ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచారించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో సూర్యభగవానుడి ఆకృతిలో కార్తీక దీపారాధాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామ రాజు పర్యవేక్షణలో భక్తులు సౌకర్యార్థం పూర్తి ఏర్పాట్లు చేశారు. కొమురవెల్లి క్షేత్రంలో మల్లన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బోనం నివేదించి, పట్నాలు వేసి, ఒడిబియ్యం, పట్టువస్త్రాలను సమర్పించారు. గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టి తమ కోర్కెలను ఈడేర్చమని వేడుకున్నారు. ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో నిర్వహించిన నిత్యకల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం, సాయంత్రం వరకు జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం చేరుకొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయం మహామండపంలో నిర్వహిస్తున్న నిత్య కల్యాణోత్సవం

జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ అమ్మవారు.

గంజాయి గాలం.. బెట్టింగ్ భూతం

వ్యసనాల ఉచ్చులో చిక్కుకుని యువత భవిత ఆగం

- 30 ఏళ్ల లోపు వారే అధికం
- పట్టణాల నుంచి గ్రామాల్లోకి సంస్కృతి
- ఈజీ మనీ వేటలో ఆత్మహత్యకు దారి
- తల్లిదండ్రులకు తీరని వేదన



గజ్వేల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పనిచేస్తుంటే, నేటి యువతలో కొంతమంది మాత్రం పెడ ధోరణి వైపు పయనిస్తూ వారి ఆశలను, కలలను చిదిమేస్తున్నారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలై అనారోగ్యం పాలవుతుండగా, మరికొందరు అత్యాశతో ఈజీ మనీ కోసం వాటి అక్రమ రవాణా, విక్రయాల్లోకి దిగి తమ జీవితాలను చేజేతులా పాడు చేసుకుంటున్నారు.

మూడు పదుల వయసులోని వారే..

గంజాయి లేదా అక్రమ వ్యాపారాల్లో పట్టుబడుతున్న వారిలో అధిక శాతం మంది 30 ఏళ్లలోపు ఉన్నవారే. గజ్వేల్, రాయపోల్, కొండపాక, ములుగు, సిద్దిపేట, హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో గతేడాది జనవరి నుంచి జరిగిన అరెస్టులను పరిశీలిస్తే, నిందితుల వయస్సు 20 నుంచి 30 మధ్యే ఉన్నాయి. పదవ తరగతి నుంచే గంజాయికి అలవాటు పడుతున్న విద్యార్థులు, యువకులు చదువు, ఉద్యోగం, వ్యాపారంపై దృష్టి సారించకుండా మత్తులో తేలుతూ చిన్న వయసులోనే అనారోగ్యాలకు గురవుతున్నారు. నవంబరులో గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన యువకుల వయస్సు 21, 23. అక్టోబరులో పట్టుబడిన యువకులు 24, 25 సంవత్సరాలే. జూన్‌లో ములుగు మండలంలో పట్టుబడిన వారు 25ఏళ్లలోపే. గతేడాది ఆగస్టులో జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఏడుగురు నిందితుల్లో నలుగురు 20 ఏళ్ల వారు కాగా, మిగతా వారు 24, 29, 30 వయసు వారు. దీన్ని బట్టి యువత ఏ స్థాయిలో గంజాయికి అలవాటు పడ్డారో అర్థం అవుతుంది.

పల్లెలకు పాకిన మత్తు ఉచ్చు

గతంలో కేవలం పట్టణాలకే పరిమితమైన గంజాయి సేవనం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు ఇప్పుడు గ్రామాల్లోకి కూడా చొచ్చుకురావడం మరింత ఆందోళనకరం. పల్లెటూరి కళాశాల విద్యార్థులు సైతం ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. పలువురు యువకులు

మిగతా 8వ పేజీలో

తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ నేతలు నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు అక్కడే మకాం వేశారు. ద్వితీయ శ్రేణి నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలంతా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. పది రోజులుగా నగరంలోనే బస చేస్తూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ముమ్మరంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈనెల 11వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్న క్రమంలో రెండ్రోజుల ముందుగానే ప్రచారాన్ని ముగించాల్సి ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఆయా పార్టీల ముఖ్యనేతలు దిశానిర్దేశం చేస్తున్నారు.



బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచార సమావేశంలో ఎంపీ రఘునందన్‌రావు

ప్రచారంలో మేముసైతం

ఉప ఎన్నికల క్యాపెయినింగ్‌లో ఉమ్మడి జిల్లా నేతలు

- నగరంలో మకాం వేసిన ముఖ్యనాయకులు
- హరీశ్ ఆధ్వర్యంలో వంద ఓట్ల ఇన్‌చార్జిల ఎంపిక
- కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం
- అక్కడే ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రచారం

సంగారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాలు సహా, హుస్నాబాద్ నియోజకవర్గం, చేర్యాల ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు జూబ్లీహిల్స్‌లోనే ప్రచారం చేస్తుండడంతో స్థానికంగా ఆసక్తి రేపుతోంది. ఇక్కడి నేతల ప్రభావం అక్కడ ఎంత వరకు పనిచేస్తుందోనని చర్చ జరుగుతోంది.

హరీశ్‌రావు దిశానిర్దేశం..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన వెంటనే జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అక్కడ వాలిపోయారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమన్వయం చేసుకుంటూ జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టారు. పలు రోడ్‌షోలు, సమావేశాల్లో తనవాణి వినిపించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నేతలకు ఆ నియోజకవర్గంలోని డివిజన్లు, వార్డులు, కాలనీల వారీగా ఇన్‌చార్జి బాధ్యతలు



ప్రచారంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

మిగతా 7వ పేజీలో



సోల్స్ డే

క్రైస్తవులు ఆదివారం సోల్స్ డేను నిర్వహించారు. సిద్దిపేట పట్టణం గణేష్‌గడ్డ గ్రేవియార్డ్‌లోని తమ పూర్వీకుల సమాధులను అలంకరించి, కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. - జిల్లా స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



'బండారి' మాయ

కొమురవెల్లి ఆలయ పరిసరాల్లో కల్తీ పసుపు విక్రయం

- రాయిపొడి, వరిపిండి కలుపుతున్న వైనం
- భక్తుల నమ్మకంతో వ్యాపారుల ఆటలు

కొమురవెల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో భక్తులు అత్యంత పవిత్రంగా భావించి, నుదుటిన ధరించే బండారి(పసుపు) సైతం కల్తీ కావడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. ఆలయ పరిసరాల్లోని దుకాణాల్లో కొందరు వ్యాపారులు ఈ కల్తీ పసుపును విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ వ్యాపారం రోజురోజుకూ జోరుగా సాగుతున్నా, దీనిని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

బండారి చుట్టూనే మల్లన్న పూజలు


ప్రతి ఏటా కొమురవెల్లి మల్లన్న స్వామిని సుమారు 25 లక్షల మంది భక్తులు దర్శించుకుంటారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతీ ఆదివారం లక్ష మందికిపైగా భక్తులు వస్తుంటారు. మొక్కుబడిలో భాగంగా స్వామివారికి పసుపును సమర్పించడం ఇక్కడ ఆనవాయితీ. కొందరు భక్తులు ఇళ్ల నుంచి స్వచ్ఛమైన పసుపును తెస్తున్నా, ఎక్కువ మంది భక్తులు మాత్రం ఆలయ పరిసరాల్లోని దుకాణాల్లో పసుపును కొనుగోలు చేసి సమర్పిస్తున్నారు. స్వామివారి బండారిని భక్తులు నుదిటిన ధరించడంతో పాటు, పట్నాలు వేసేటప్పుడు, పూజల్లో విరివిగా ఉపయోగిస్తారు. ప్రతి ఏటా సుమారు 200 నుంచి 300 టన్నుల పసుపును స్వామివారికి మొక్కుబడిగా సమర్పిస్తున్నారు. సాధారణంగా నాణ్యమైన పసుపు కిలో రూ.400 వరకు ఉన్నప్పటికీ, కొమురవెల్లిలో మాత్రం రూ.100 నుంచి రూ.200కే లభిస్తుండటంతో, తక్కువ ధరకు వస్తుందనే ఉద్దేశంతో భక్తులు తెలియక కల్తీ పసుపును కొనుగోలు చేస్తున్నారు.

చర్యలు మాత్రం శూన్యం

జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు హడావుడిగా తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సేకరించడం తప్ప ఆ తర్వాత ఎలాంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. అధికారులకు ముడుపులు అందుతున్నందునే చర్యలు తీసుకోవడం లేదనే తీవ్ర విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

కల్తీ పసుపుతో అనారోగ్య సమస్యలు

కొమురవెల్లి బండారిని భక్తులు కేవలం నుదుటిన బొట్టుగా ధరించడమే కాక, ఔషధంగా భావించి నోట్లో వేసుకుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో పట్నాల వద్ద ఒంటిపై చల్లుకుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న బండారిని వరిపిండి, రాయిపొడి వంటి పదార్థాలు కలిపి కల్తీ చేయడం వలన భక్తులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కల్తీ పసుపు వ్యాపారాన్ని అరికట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఆలయ పరిసరాల్లో అమ్ముతున్న పసుపు

పిండికలిపిన పసుపు

మల్లన్న క్షేత్రంలోని తోటబావి వద్ద పెద్దపట్నం వేసిన సమయంలో భక్తులపై చల్లిన బండారి (ఫైల్)

కుంటిసాకులు చెబితే ఉపేక్షించను

- కలెక్టర్ హైమావతి
- చేర్యాల కస్తూర్బాలో ఆకస్మిక తనిఖీ

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, కూరగాయలు లేవంటూ సాకులు చెబితే ఉపేక్షించబోనని కలెక్టర్ హైమావతి సిబ్బందిని హెచ్చరించారు. చేర్యాల పట్టణంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆదివారం రాత్రి కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాత్రివేళ భోజన తయారీ పరిశీలించి మెనూ, పరిమాణం ఇతరత్రా వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కూర తయారు చేయాలని, వంట సరుకులు సమపాళ్లలో వినియోగించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని డ్యూటీ టీచర్లకు సూచించారు. విద్యార్థులు కడుపునిండా భోజనం చేస్తేనే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామని బాధపడకుండా గురుకుల వాతావరణం అలవర్చుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.



కస్తూర్బా విద్యాలయంలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

జాతీయస్థాయి టోర్నమెంట్‌లో సిద్దిపేట క్రీడాకారుడి ప్రతిభ

- వరుస ఫుట్‌బాల్ మ్యాచుల్లో గోల్స్
- అండర్-13 టోర్నమెంట్‌లో రాణిస్తున్న అనస్

7



పిల్లలు పుట్టడం లేదని యువకుడి ఆత్మహత్య

అంతాయిగూడలో ఘటన

6



వరద ముప్పు.. ఎవరిది తప్పు?

- చినుకు పడితే చెరువును తలపిస్తున్న చేర్యాల
- రెండు చెరువులున్నా తప్పని జలగండం
- అనాలోచిత చర్యలు, నాలాల ఆక్రమణతో రోడ్లు నీటమునక
- సహాయక చర్యల్లో మునిసిపల్ అధికారుల తాత్సారం

8

మూతపడిన పరిశ్రమలో అగ్నిప్రమాదం



రూప కెమికల్ పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

పటాన్‌చెరు నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూతపడిన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన పటాన్‌చెరు పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూప కెమికల్స్ పరిశ్రమలో ఆదివారం రాత్రి సమయంలో గోదాములో నిల్వ చేసిన రసాయనాల డ్రమ్ముల నుంచి మంటలు వ్యాపించాయి. నిమిషాల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆరు నెలలుగా పరిశ్రమను మూసి ఉండగా ఇద్దరు సెక్యూరిటీ గార్డులు కాపలా ఉంటున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పటాన్‌చెరు, బీడీఎల్, సంగారెడ్డి, భెల్, అరబిందో, ఓడీఎఫ్ ప్రాంతాలకు చెందిన ఆరు అగ్నిమాపక వాహనాలత సహాయంతో మంటలను ఆర్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సీఐ వినాయకరెడ్డి ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేశారు.

కల్తీ గమ్మత్తు

కల్లు తాగితే రెండు రోజులైనా దిగని మత్తు

- మనోహరాబాద్ మండలంలో పుట్టగొడుగుల్లా కల్లు దుకాణాలు
- అధిక మోతాదులో మత్తు పదార్థాల వాడకం
- ప్రాణాలు కోల్పోతున్న మందుబాబులు
- పరిశ్రమల కార్మికులే లక్ష్యంగా అమ్మకాలు
- మామూళ్ల మత్తులో అధికారులు!



ఖాళీ ప్లాట్‌లో ఏర్పాటు చేసిన కల్లు దుకాణం..





కల్లు తాగి పడిపోయిన మద్యం ప్రియులు

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు కేంద్రంగా ఉంది. కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఎంతోమంది అనేక రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇక్కడే అద్దెకు నివాసం ఉంటున్నారు. వీరు కుటుంబ పోషణ భారం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యానికి అలవాటు పడుతున్నారు. మద్యం కొనేందుకు డబ్బులు లేక, మత్తు కోసం గ్రామంలో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్లు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కల్లు దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కార్మికులే లక్ష్యంగా కల్తీ కల్లు, మద్యాన్ని విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మోతాదుకు మించి..

కల్లులో మోతాదుకు మించి మత్తు పదార్థాలు కలుపుతుండడంతో తాగినవారికి రెండు రోజులైనా మత్తు దిగడం లేదు. ఈ నేపథ్యంలో పలువురు కల్తీకి కల్లుకు బానిసవుతున్నారు. వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో కొంతమంది ఎక్కడ పడితే అక్కడ షెడ్లు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా కల్లు విక్రయిస్తున్నారు. ఏకగా పరిశ్రమల వద్ద, గ్రామ శివారులోని కార్మికులు ఉండే ఖాళీ ప్లాట్లలోనూ కల్లు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయకపోవడంపై పలు అనుమానులకు తావిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. యంత్రాంగం మండలంలో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే, ప్రాణాలు పోతే తప్ప అటువైపు చూసిన దాఖలాలు లేవనే వాదనాలున్నాయి.

తాగారంటే.. పడిపోవాల్సిందే..

ఇక్కడి కల్లుగా తాగారంటే పడిపోవాల్సిందే. ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గత జూలైలో ఒక దుకాణంలో కల్లు తాగి ముగ్గురు కార్మికులు అక్కడే మత్తులో పడిపోయారు. ఎక్కడ చూసినా కల్లు ప్రియులు పడిపోయి కనిపిస్తున్నారు. నిత్యం ఇదే కల్లు తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నా సంబంధిత అధికారులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిర్వాహకుల నుంచి అందుతున్న మామూళ్లే అందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు..

మరోవైపు విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కార్మికులనే ఆసరా చేసుకుని కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులు పక్క రాష్ట్రాల నుండి గంజాయి తెచ్చి అమ్ముతున్నారు. ప్రతి రెండు నెలల వ్యవధిలో మండలంలో గంజాయి పట్టుకోవడం జరుగుతోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు కార్మికులను దృష్టిలో పెట్టుకొని మనోహరాబాద్ మండలంలోని కల్తీ మద్యం, కల్లు దుకాణాల్లో తనిఖీలు చేసి కల్తీని కట్టడి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రూ.5 కోట్ల విలువైన నక్షాబాటకు ఎసరు



నక్షాబాటను ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీ

కంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల జోలికొస్తే ఉపేక్షించబోమని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నా కంది మండలంలో రియాల్టర్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఓవైపు అసైన్డ్ భూములను అమ్ముతూ, మరోవైపు నక్షాబాటలను, కుంటలను, శిఖం భూములను కబ్జా చేస్తూ అధికారులకు సెలవు రోజు కూడా మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కంది మండలంలోని జుల్‌కల్ గ్రామంలో కొందరు అక్రమార్కులు సర్వేనెంబర్ 24లో ఉన్న దాదాపు ఎకరం మేర రూ.5 కోట్ల విలువైన నక్షాబాటకు ఎసరు పెట్టారు. కంది-శంకర్ పల్లి హైవే పక్కనే ఉన్న సదరు నక్షాబాట భూమిలో ఆదివారం అధికారులు ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ప్రహరీ నిర్మాణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే జుల్‌కల్ పంచాయతీ అధికారులు ఇది అక్రమ నిర్మాణమని నోటీసులిచ్చినా లెక్కచేయకుండా ప్రహరీ పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామంలో పొలాలకు వెళ్లే రైతులకు దారి లేకుండా పూర్తిగా మూసుకుపోయింది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రహరీని తొలగించాలని కోరుతున్నారు

చిత్తుబొత్తు ఆడుతున్న 11 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

పెద్దశంకరంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని వీరోజిపల్లి గ్రామంలో చిత్తుబొత్తు ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్ధరాత్రి అనంతరం వీరోజిపల్లి కల్లు దుకాణం వెనుక చిత్తుబొత్తు ఆడుతున్నారని సమాచారం అందడంతో, పోలీసులు దాడి చేశారు. వారి దగ్గర నుంచి రూ.17709 నగదును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, వారిని పేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. వీరోజిపల్లి గ్రామానికి చెందిన పలువురిని ఈ ఘటనలో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నం



దొంగలు ఎత్తుకెళ్లిన ఆలయ హుండీ

మాసాయిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం రామంతాపూర్ గిరిజన తండాలోని సంత్ సేవాలాల్ ఆలయంలో చోరీ యత్నం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత నెల 22న ఆలయ హుండీ డబ్బులు చోరీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. హుండీని ఎత్తుకెళ్లి దూరంగా పగలగొట్టే ప్రయత్నం చేశారని తండావాసులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా

- టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

తూప్రాన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నాగులపల్లి పంచాయతీ పరిధి జెండాపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ మండల సమీపం నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో, తూప్రాన్-3 ఎస్‌ఐ యాదగిరి ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల్లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లు, టిప్పర్లలో మట్టిని నింపడానికి వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బెల్ట్ షాపుపై దాడి



పట్టుకున్న మద్యం సీసాలను చూపిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మురళీ

సిద్దిపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ కె. రాజేష్ హెచ్చరించారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి 12 లీటర్ల మద్యంను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేష్ మాట్లాడుతూ నారాయణరావుపేట మండల కేంద్రంలో కిరాణా దుకాణంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో సుమారు రూ.12 వేల విలువైన 12 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని తెలిపారు. అలాగే, గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పిల్లలు పుట్టడం లేదని వ్యక్తి ఆత్మహత్య



బాలయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో పాటు, పిల్లలు పుట్టడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలం అంతాయిగూడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తిగుళ్ల బాలయ్య(30), కల్యాణి దంపతులకు వివాహమై ఎనిమిదేళ్లు అవుతున్నా నేటికి పిల్లలు పుట్టడం లేదు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు ఏర్పడడంతో గత నెల 28న ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న బాలయ్య పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండ చిలువను చంపిన గ్రామస్థులు




కంగ్టి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగూర్.కె గ్రామంలో ఆదివారం పంట పొలాల్లో కనిపించిన భారీ కొండ చిలువను గ్రామస్థులు చంపివేశారు. గ్రామానికి చెందిన రైతు విఠల్ రోజు మాదిరిగానే ఆదివారం పొలానికి వెళ్లాడు. పశువులకు మేత కోసుకునేందుకు సిద్ధమవుతుండగా భారీ పొడవైన కొండ చిలువ కనిపించింది. దీంతో విఠల్ చుట్టు పక్కన ఉన్న తోటి రైతుల సహాయంతో కొండ చిలువను కొట్టి చంపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.












నిండుగా మాచిరెడ్డిపల్లిలోని నర్సిరెడ్డి చెరువు


భారీ వర్షాలకు నిండిన బడంపేటలోని దేవుని చెరువు

నిండుకుండల్లా నీటి వనరులు

● తాగు, సాగు నీటికి ఢోకా లేదంటున్నరైతులు

కోహీర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు జలకళతో దర్శనమిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఎడారిగా మారిన చెరువులన్నీ ప్రస్తుతం వరద నీటితో నిండుకుండల్లా మారాయి. కొన్ని సంవత్సరాల నుంచి నీరు లేక బీడువారిన చెరువులలో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోహీర్ మండలంలోని 24 చెరువులు జలకళతో కనిపిస్తున్నాయి. గొటిగర్‌పల్లి గ్రామంలోని పెద్ద చెరువు నిండుకుండలా దర్శనం ఇవ్వడమే కాకుండా అలుగు దూకుతోంది. అలాగే పర్శపల్లిలోని రాముని చెరువు, బడంపేటలోని దేవుని చెరువు, ఈదులకుంట చెరువు, చింతలఘట్టు శివారులోని గుండం చెరువు, మాచిరెడ్డిపల్లిలోని నర్సిరెడ్డి చెరువుతో సహా ఇతర చెరువులన్నీ నిండాయి. చెరువులే కాకుండా వాగులు, వంకలు, చిన్న చిన్న కుంటలు కూడా వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో ఈసారి భారీ వర్షాలు నమోదవడం వల్ల భూగర్భ జలాలు అమాంతంగా పెరిగాయి. మండలంలోని బిలాల్‌పూర్, వెంకటాపూర్, మనియార్‌పల్లి, గొటిగర్‌పల్లి తదితర గ్రామాల్లో బోరు బావుల్లో నీరు పైకి వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వేసవి సీజన్‌లో సాగు, తాగు నీటికి ఇబ్బంది ఉండదని వారు పేర్కొంటున్నారు.


చింతలఘట్టు గుండం చెరువు

నేడు కొల్లూరుకు ముగ్గురు మంత్రుల రాక

● ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ డైరెక్టర్ గౌతమ్

రామచంద్రాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధిలోని కొల్లూరుకు నేడు ముగ్గురు మంత్రులు రానున్నారు. రెండు పడక గదుల ఇళ్ల ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్, దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ వివిధ కేటగిరీల అధికారుల బృందంతో కలిసి పర్యవేక్షించారు. ఉదయం నుంచి మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రాజెక్టు కింద వీఎస్‌టీ కంపెనీ ఈ నిర్మాణాన్ని చేపట్టడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్ రౌండ్‌టేబుల్ ట్రస్ట్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ల సహకారంతో మొత్తం 56 తరగతి గదులు నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే ఎకరం స్థలాన్ని కేటాయించింది. మొదటి దశలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో 28 తరగతి గదులు నిర్మించనున్నారు. వీటికి అనుబంధంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో 980 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు, వారిలో 760 మంది రోజువారీగా హాజరవుతున్నారు. వీరికి కమ్యూనిటీ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఎట్టకేలకు బడి భవనానికి మోక్షం

● రూ.50 లక్షలతో నిర్మాణం.. తీరనున్న విద్యార్థుల కష్టాలు


భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రౌండ్‌టేబుల్ ఇండియా ప్రతినిధులు

నర్సాపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల భవనం ఎన్నో ఏళ్లుగా పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో విద్యార్థుల కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో కొత్త భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. స్థానిక జడ్జి హేమలత చొరవతో మండల లీగల్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో స్వచ్ఛంద సంస్థల సహకారం కోసం ప్రయత్నించగా, హైదరాబాద్‌కు చెందిన రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థ ముందుకు వచ్చింది. పాత శిథిల భవనం పూర్తిగా తొలగించి, రూ.50 లక్షలతో మూడు నెలల్లో కొత్త భవనం పూర్తి చేయడానికి ఈ సంస్థ అంగీకరించింది. శనివారం సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా భూమి పూజ కూడా చేశారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ప్రమాదకరంగా ఉన్న భవనంలో చదువుతున్న విద్యార్థులకు త్వరలో నూతన భవనం రానుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

● ఆన్‌లైన్ గేమ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

కంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో రాణించాలంటే ప్రతీ విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఐటీహెచ్‌లో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తుపై పట్టు సాధించాలన్నారు. కష్టపడి చదివినప్పుడే విజయ తీరాలను చేరుకోగలమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరగాళ్లు చిన్న పిల్లలనే లక్ష్యంగా లింక్స్ పంపుతూ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ సిబ్బంది, రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు డా.హిమబిందు, డా. శుహిత, డా.అర్వింద్, డా. ప్రేమ్‌పాల్, కంది మండల విద్యాధికారి జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో జన సందోహం

● జలదిగ్బంధంలోనే దుర్గమ్మ

పాపన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆదివారం భక్త జన సందోహంగా మారింది. సింగూరు నుంచి విడుదల చేసిన నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆలయం మూసివేశారు. రాజగోపురంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, పూజలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, ఆలయ సిబ్బంది, ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకున్నారు.


భక్తులతో కిట కిట లాడుతున్న ఏడుపాయల

కేతకీలో ఘనంగా కార్తీక మాస దీపారాధన

ఝరాసంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో శివరుద్రప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం, గంగహారతి, లక్షదీపారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో


ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రచారంలో మేము సైతం

5వ పేజీ తరువాయి

అప్పగించారు. సిద్దిపేట ఫార్ములాను అనుసరించి జూబ్లీహిల్స్‌లోనూ వంద ఓట్ల జాబితాల వారీగా విభజించి వాటికి కూడా ఇన్‌చార్జిలను నియమించారు. ఈ క్రమంలో హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ ఈనెల 28వ తేదీన చనిపోయారు. దీంతో హరీశ్‌రావు ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ.. అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలకు మాత్రం దిశానిర్దేశం చేస్తూనే ఉన్నారు. తనకు సమయం చిక్కినప్పుడల్లా ఉపఎన్నిక ప్రచారం, ఇతర పరిణామాలపై ఆరా తీస్తూ సూచనలు ఇస్తున్నారు. ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం ప్రచారంలోనే ఉన్నారు.

పొన్నం ప్రభాకర్ పర్యవేక్షణలో..

హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జూబ్లీహిల్స్‌పైనే ప్రత్యేకంగా దృష్టిసారించారు. హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ప్రభాకర్ పర్యవేక్షణలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ముఖ్యనేతలు ప్రచారం చేస్తున్నారు. డివిజన్ల వారీగా బాధ్యతలు కేటాయించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అక్కడే మకాం వేశారు. ఇక మంత్రి దామోదర్ రాజనర్సింహ సైతం ఇటీవల జూబ్లీహిల్స్ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇదిలాఉంటే ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు నిత్యం పొన్నం పర్యవేక్షణలో ప్రచారబాట పడుతున్నారు.

కీలకంగా రఘునందన్

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారు. ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అక్కడే మకాం వేసి ప్రచారం చేస్తున్నారు. ప్రచార సభలు, రోడ్ షోలలో తనదైన శైలిలో మాట్లాడుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులను సమన్వయం చేస్తూ పార్టీ శ్రేణులను ప్రచారంలో పాల్గొనేలా పావులు కదిపారు. ఇక ఉమ్మడి జిల్లాకే చెందిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి సైతం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. తన సతీమణి గోదావరితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు.

జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో సిద్దిపేట క్రీడాకారుడి ప్రతిభ

● వరుస ఫుట్‌బాల్ మ్యాచుల్లో గోల్స్


ఫుట్‌బాల్ ఆడుతున్న అనస్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్ అండర్-13 టోర్నమెంట్‌లో సిద్దిపేట ఫుట్‌బాల్ క్రీడాకారుడు అనస్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ టీం సెలెక్షన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 600 మంది క్రీడాకారులు హాజరు కాగా, అనస్ వారిని వెనక్కి నెట్టి ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో గోల్స్ చేస్తూ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఉత్తరాఖండ్‌పై అనస్ తొలి గోల్ సాధించాడు. జమ్మూకశ్మీర్‌తో జరిగిన పోటీలోనూ అనస్ గోల్ చేశాడు. మేఘాలయ టీంతో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో, చివరి నిమిషంలో అనస్ చేసిన గోల్‌తో తెలంగాణ టీం ఫైనల్‌కు చేరుకుంది. ఈ నెల 8న ఫైనల్ పోరు జరగనుంది. వరుస గోల్స్‌తో ప్రతిభ కనబరుస్తున్న అనస్‌ను తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ అభినందించారు. అనస్ ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ, సిద్దిపేట నుంచి ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. డీవైఎస్‌వో వెంకట నర్సయ్య, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సాజిద్, కార్యవర్గ సభ్యులు హరీశ్, లక్ష్మీనారాయణరెడ్డి అనస్‌కు అభినందనలు తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

● ఎస్‌జీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సౌందర్య


మల్లకంబలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య అన్నారు. ఆదివారం నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి మల్లకంబ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు నవంబర్ 4, 5, 6 తేదీల్లో చౌటుప్పల్‌లో రాష్ట్ర స్థాయి మల్లకంబ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. చింతమడక, రాఘవాపూర్, నారాయణరావుపేట, తడకపల్లి ఆవాస విద్యాలయాల విద్యార్థులు అండర్-14, అండర్-17 బాలబాలికలు మొత్తం 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లకంబ జిల్లా అధ్యక్షులు చిప్ప ప్రభాకర్, యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు తోట సతీష్, వెంకట్ స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగిలో గంజాయి స్వాధీనం


నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ముత్తంగి నుంచి ఇంద్రేశం వెళ్లే రింగ్ రోడ్ సర్వీస్ రోడ్‌లో ఆటోలో గంజాయి తరలిస్తుండగా మెదక్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితులైన రామచంద్రపురం పట్టణానికి చెందిన జాదవ్ రవి, పటాన్‌చెరుకు చెందిన చౌహాన్ రాజులను అదుపులోకి తీసుకుని 12.810 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.4.50లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుల నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు విచారణ చేస్తున్నారు. ఈ దాడిలో మెదక్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గాంధీ నాయక్, చంద్రశేఖర్, వీరారెడ్డి, ఎస్సైలు అనిల్ కుమార్, యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు అధ్వానం

● అద్దె, ఇరుకు గదులు, రేకుల షెడ్లలో విద్యాబోధన

● కొన్ని గ్రామాలలో చెట్ల కిందనే చదువులు

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్ని చోట్ల సొంత భవనాలు లేకపోవడంతో చెట్లకిందనే చదువు ను కొనసాగిస్తున్నారు. మరికొన్ని చట్లో టీచర్లు తమ సొంత ఖర్చులతో భవనాలు ఏర్పాటు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.మండలంలో సుమారు 17 గ్రామ పంచాయితీలలో కలిపి 25 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఎనిమిది కేంద్రాల్లో ఆయాలు లేక టీచర్లే పనులను నెట్టుకొస్తున్నారు. కాళ్లకల్ మేజర్ గ్రామ పంచాయతీలో కార్మికులు ఎక్కువగా ఉండటం, పరిశ్రమల ఏరియా కావడంతో మూడు అంగన్‌వాడీలు ఏర్పాటు చేశారు.

అద్దె రూ.6 వేలు.. ప్రభుత్వం ఇచ్చేది రూ.1000

ఇక్కడ అద్దె గదికి సుమారు రూ.6వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. కానీ ప్రభుత్వం ఒక్కో అంగన్‌వాడీ గదికి కేవలం రూ.1,000 మాత్రమే చెల్లిస్తుందని టీచర్లు తెలిపారు. 25 అంగన్‌వాడీ సెంటర్లలో 13 మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవనాలుండగా, మిగతావి మహిళా భవనం, ప్రభుత్వ పాఠశాలలు, జీపీ లేదా ఇతర సంఘ భవనాల్లో కొనసాగుతున్నాయి. రెండు అంగన్‌వాడీలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి అద్దె ఆరు నెలల వరకు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందులో పనిచేసే ఉపాధ్యాయులు వంట సామాగ్రి, కూరగాయల ఖర్చులకు కూడా తమ సొంత డబ్బు ఖర్చు చేసి, ఆరు నెలలకు ఒకసారి వచ్చినప్పుడు తీసుకుంటున్నారు.


కాళ్లకల్‌లో మూతపడిన రెండో అంగన్‌వాడీ కేంద్ర భవనం

చెట్లకిందనే చదువులు..

ఇక పర్కిబండ గ్రామ పరిధి తుపాకులపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ భవనం శిథిలమైపోవడంతో నాలుగు సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టు కిందనే చదువులు కొనసాగిస్తున్నారు. కాళ్లకల్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, ఒకటి మాత్రమే ప్రభుత్వం నిర్మించింది. మరో రెండు అద్దె గదిలో, రేకుల షెడ్డులో నడుస్తున్నాయి. రెండో సెంటర్ పెంకుటిల్లు శిథిలమైపోవడంతో, ప్రస్తుతం 2, 3 సెంటర్ల పిల్లలు ఒకే గదిలో చదువుకుంటున్నారు. ఈ సెంటర్‌లో పనిచేసే ఉపాధ్యాయురాలు అంగన్‌వాడీ కోసం తన సొంత స్థలంలో, సొంత నిధులతో రేకుల గది ఏర్పాటు చేసుకొని, అక్కడనే పిల్లలకు బోధిస్తున్నారు. ఈ విషయమే మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేహతబేగంను వివరణ కోరగా అంగన్‌వాడీల పరిస్థితి అధ్వానంగా ఉండడం వాస్తవమేనన్నారు. దీనిపై పై అధికారులకు సమాచారం అందిస్తున్నా ఫలితం లేదని, ఇప్పటికైనా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.


తుపాకులపల్లి గ్రామంలో చెట్టకిందనే అంగన్‌వాడీ పిల్లలకు బోధన


తుపాకులపల్లిలో శిథిలావస్థకు చేరడంతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

వరద ముప్పు.. ఎవరిది తప్పు?

- చినుకు పడితే చెరువును తలపిస్తున్న చేర్యాల
- రెండు చెరువులున్నా తప్పని జలగండం
- అనాలోచిత చర్యలు, నాలాల ఆక్రమణతో రోడ్లపైకి వరద
- నీటిపారుదలశాఖ అధికారులపై ఆగ్రహం.. సహాయకచర్యల్లో మునిసిపల్ అధికారుల తాత్సారం





ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై నిలిచిన వరదనీరు,యూనియన్ బ్యాంక్ సమీపంలో వరదనీటి ఇక్కట్లు, అర్ధాంతరంగా వదిలేసిన పెద్దచెరువు మత్తడి నీటి మళ్లింపు కాలువ

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణం చుట్టూ రెండు చెరువులున్నప్పటికీ చినుకు పడితే పట్టణమే మరో చెరువులా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఓ చెరువు నాలాలు ఆక్రమణకు గురై వరదనీరు జనావాసాలకు చేరుతుండగా, మరో చెరువు మత్తడి ప్రవాహం మళ్లింపు కాలువ నిర్మాణం అర్ధాంతరంగా నిలిపి వేయడంతో మునకకు గురవుతుంది.



జనావాసాల మధ్యన నడుములోతు వరదనీరు

అధికారుల తప్పిదం.. ప్రజలకు శాపం

గతంలో రెవెన్యూ, నీటిపారుదలశాఖ, పంచాయతీ అధికారులు ఒకరి తప్పిదాన్ని మరొకరు ఆసరా చేసుకుని వేసిన తప్పటడుగులతో జలగండం నెలకొన్నది. పట్టణంలో ఓ భాగం వైపు ఎటుచూసినా పలు కాలనీలు జలమయమవుతుండటంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆకాశంలో మబ్బులు కమ్ము కున్నా, చిన్నపాటి వర్షం కురిసినా ఆయా కాలనీవాసుల గుండెలు గుభేలుమనే పరిస్థితి నెలకొన్నది. వరద నీరు రోడ్డెక్కుతుండటంతో వాహన దారులు తంటాలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా నాలాల పునరుద్ధరణ, మత్తడి కాలువ పూర్తితో వరద ముప్పు నివారణ చర్యలు పట్టనట్లుగా నీటిపారుద ల, మునిసిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపట్ల స్థానికులు మండిపడుతున్నారు.

ఆక్రమణలతో మూసుకుపోయిన కుడిచెరువు నాలాలు, కల్వర్టులు

చేర్యాల పట్టణంలో 25వేల జనాభా, 12వార్డులు, పది శివారుకాలనీలు, 4,500కుపైగా జనావాసాలున్నాయి. భూగర్భ జలాల నీటిమట్టం పెంపు కోసం ఓ వైపు పెద్దచెరువు, మరోవైపు కుడిచెరువు ఉన్నాయి. రెండు చెరువులు కూడా పట్టణ తాగు, సాగునీటి అవసరాలకు ఎంతో దోహదపడతున్నాయి. కుడిచెరువులోకి కడవేరుగు దారి, సమీప ఇతర ప్రదేశాల్లోని నాలాలతో పాటు గాంధీచౌక్ కల్వర్టు, ఆర్టీసీ బస్టాండు సమీప కల్వర్టు, సెవెన్‌హిల్స్ హోటల్ సమీపంలోని కల్వర్టు, పెట్రోల్ పంప్ కల్వర్టు గుండా వరదనీరు నేరుగా చేరేది. కానీ రియల్ వ్యాపారుల అక్రమచర్యలతో పాటు నీటిపారుదలశాఖాధికారుల తప్పుడు అనుమతుల కారణంగా మట్టి, మొరం నింపి నిర్మాణాలు చేపట్టారు. నాలాలు, కల్వర్టులు మూసివేయడంతో వరదనీరు చేరే మార్గం మూసుకుపోవడం, గాంధీచౌక్ వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా చేర్యాల-కడవేరుగు దారి, చేర్యాల-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారులతో పాటు చుట్టూ జనావాసాలు నీట మునిగిపోతున్నాయి. మోకాలిలోతు నీరు ప్రవహిస్తుండటం వలన బయటకు వెళ్లలేకపోవడంతో పాటు వాహనాల రాకపోకలకు ఆటంకాలు తలెత్తుతున్నాయి. గతంలోనే కుడి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, అక్రమణలపై కాంటూర్ లెవల్ సర్వే చేపట్టి నోటీసులుసైతం జారీ చేసినా నీటిపారుదలశాఖాధికారులు మారుతున్నారే తప్ప చర్యలు చేపట్టకపోవడం చేర్యాలవాసుల పాలిట శాపంగా మారింది.

పాఠశాలలకు నీటిగండం

పెద్దచెరువు మత్తడి వరదనీటి ప్రవాహం కారణంగా వికాస్ గ్రామర్‌స్కూల్, శ్రీచైతన్య పాఠశాలలు, అలాగే కుడిచెరువు నాలాల మూసివేతతో కడవేరుగు దారిలో ఒక్లే పాఠశాలలు ముంపుబారిన పడుతున్నాయి. ఆయా పాఠశాలల ఆవరణలో నీటిప్రవాహం కొనసాగుతుండటంతో విద్యార్థులకు ముప్పు పొంచి ఉండటంతో తల్లిదండ్రులు కలవరపడుతున్నారు.

పెద్దచెరువు ఇలా..

అలాగే పట్టణంలోని పెద్దచెరువును గతంలో గోదావరి జలాలను నింపడంతో సుమారు 150యేళ్ల అనంతరం మత్తడి పారింది. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో మత్తడి నీరంతా నేరుగా రోడ్డుగుండా అంగడిబజారు వరకు ప్రవహించి పలు కాలనీలలోకి వరదనీరు చేరింది. దీంతో వ్యాపారులు, ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మత్తడి నీరు రోడ్డు మీదకు చేరకుండా కట్టవెంబడి కాలువ ద్వారా గాంధీచౌక్ కల్వర్టుకు అనుసంధానం చేయాలని నిర్ణయించి కాలువ నిర్మాణం చేపట్టారు. కానీ రాజకీయ దుమారం రేపడంతో కాలువను మధ్యలోనే నిలిపివేశారు. ఏళ్లు గడుస్తున్నా నీటిపారుదలశాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కాలువ నిర్మాణం ద్వారా రోడ్డువెంబడి ఉన్న ఇండ్లు, దుకాణాదారులు ఊరట చెందుతున్నారు. కానీ గోదావరి జలాలతో చెరువు నింపినా, అలాగే వర్షాకాలంలో వరద నీరుచేరి చెరువు నిండి మత్తడి ప్రవహిస్తే అర్ధాంతర కాలువగుండా యాదవనగర్, శుభోదయ నగర్, రాజీవ్ నగర్ కాలనీలు నీటమునుగుతున్నాయి. స్థానికులు రోడ్డు వెంబడి వరద నీరు మళ్లించాలని ఆందోళనలు చేపడుతున్నారు.

నీటిపారుదలశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం

ఇటీవలి కాలంలో కురిసిన వర్షాలతో జలదిగ్బంధమై ప్రజలు, ప్రయాణికులు అతలాకుతలమైనప్పటికీ, ఆయా శాఖల అధికారులు పరిశీలనలతోనే సరిపుచ్చారు. నీటిపారుదలశాఖాధికారులు వరదనీటిముప్పు నివారణ చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదేక్రమంలో మునిసిపల్ అధికారులు సత్వర సహాయంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపట్ల తాత్సారం వహిస్తుండటం పట్ల ప్రజలు కినుక వహిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపచేసి నాలాల పునరుద్ధరించి కుడిచెరువుకు, అలాగే మత్తడికాలువ పూర్తిచేసి పెద్దచెరువు మత్తడినీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఇంటర్వ్యూ

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న గజ్వేల్ పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్.భానుప్రకాశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10నుంచి 12గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా సంఘాలు వివరాలివ్వాలి

- డీ వైఎస్‌వో వెంకటనర్సయ్య

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని క్రీడా సంఘాలు వారి వివరాలతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు కార్యవర్గ సభ్యుల వివరాలను ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో అందజేయాలని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సీఎం కప్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు అసోసియేషన్ ప్రారంభించిన బైలాస్, రిజిస్ట్రేషన్, గుర్తింపు పత్రం, తదితర అంశాలతో కూడిన పత్రాలను స్పోర్ట్స్ అథారిటీ సిద్దిపేట కార్యాలయంలో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత శాఖ అధికారి నెంబర్ 9441925763కు సంప్రదించవచ్చన్నారు.

ఎల్‌వోసీలు అందజేత

చేర్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన చేర్యాల లింగం ఇటీవల అనారోగ్యానికి గురవగా, వైద్యచికిత్స చేయించుకునే ఆర్థికస్తోమత లేక ఇబ్బందులుపడుతున్నాడు. ఈ విషయం తెలిసిన వీరన్నపేట మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి మంత్రి పొన్నం ప్రభాకర్‌దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.2.50లక్షల మేర ఎల్‌వోసీ మంజూరైంది. ఈ మేరకు ఆదివారం ఎల్‌వోసీని లింగంకు అందచేశారు.

దూళిమిట్ట మండలంలో..



జనగామ పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న కొమ్మూరి

● **మద్దూరు:** దూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కొడాలి పూర్ణచందర్‌రావుకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎల్‌వోసీ పత్రాన్ని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

అక్కన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, మోత్కులపల్లి శివారులోని వాగుల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మృతి చెందినవారి కుటుంబాలకు రూ, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తోందూరి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్థికస్తోమత లేని పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు పుల్లూరి రామకృష్ణ, ఇసంపల్లి కల్పన, ప్రణయ్‌లు ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చేర్యాలలో భారీ వర్షం



గాంధీచౌక్ ప్రాంతంలో కురుస్తున్న వర్షం

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురియడంతో పట్టణంలోని గాంధీచౌక్ జలమయమైంది. అసలే ప్రజలు రెండురోజులుగా వరదనీటి కష్టాలు ఎదుర్కుంటున్న క్రమంలో మళ్లీవర్షం పడి వరదనీరు చేరడంతో తంటాలుపడ్డారు. గాంధీచౌక్ వద్ద నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. హైలెవల్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండగా, ఇటీవల కంకర మిశ్రమం పోసినా సక్రమంగా చదును చేయకపోవడంతో ఓ కారు దిగబడింది.

సిద్దిపేటలో ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో వైద్యుడితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

సిద్దిపేట కల్చరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, వాసవీక్లబ్ సిద్దిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని అగస్త్యహాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ నిపుణుల వైద్యుల బృందం ఉచిత చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ 2డీ ఎకో, బీఎండీ ఎక్స్‌రే, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గంప శ్రీనివాస్, అయిత రత్నాకర్, ఆంజనేయులు, హరినాథ్, మాంకాల నవీన్ కుమార్, గంప కృష్ణమూర్తి, చంద శ్రీనివాస్, పుల్లూరి శివకుమార్, రవీందర్, మాంకాల నగేష్, చంద్రశేఖర్, పబ్బ మాధవి, కొమురవెల్లి అంజయ్య, కొమురవెల్లి చంద్రశేఖర్, చిగుళ్లపల్లి విష్ణుమూర్తి, చిగుళ్లపల్లి మంజుల, తదితరులు ఉన్నారు.



వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి




చేర్యాలలోని మహమ్మాయి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామివారికి భక్తుల పూజలు, అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతిని ఆదివారం చేర్యాలలోని మహమ్మాయి ఆలయంలో విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) పట్టణకమిటీ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్టుకు విశేష పూజలు జరిపారు. స్వామివారి మూలమంత్ర హోమం జరిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మేర్గోజు సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి భాస్కర్, గౌరవాధ్యక్షుడు రాళ్లబండి నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **అక్కన్నపేట:** మండలంలోని కేశవాపూర్‌లోని రామస్వామి గుట్టపై కొలువై ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జయంతోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కరీంనగర్‌లోని హవేలి ప్రాంతంలో బీదవారికి అన్నదానం నిర్వహించారు. ఇందులో ఆలయ ఫౌండర్, చైర్మన్ కందారపు రమేశాచార్యులు ఉన్నారు.

కాంగ్రెస్ దాడులకు భయపడబోం: బీఆర్ఎస్

చేర్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తుందని, ప్రజాసమస్యలపై గళమెత్తిన బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కాలని చూడటం తగదని బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ బంగారిగల్ల కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం చేర్యాలలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచకుండా ప్రజలను మభ్యపెట్టడంతో పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అధోగతిపాలు చేయడాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం దాడులు కొనసాగిస్తుండటం శోచనీయమన్నారు. ఉద్యమాలు, కేసులు, అరెస్టులు బీఆర్ఎస్‌కు కొత్తకాదన్నారు. మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ దాడులకు వెరవబోమని, రెట్టింపుపోరాటం కొనసాగిస్తామన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

మద్దూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి పాఠశాల, కట్టెకోత మిషన్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎస్‌ఐ షేక్‌మహబూబ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కట్టెకోత మిషన్‌లో కొద్ది రోజుల క్రితం మోటారు దొంగతనంతో పాటు రెండు రోజుల క్రితం ఉన్నత పాఠశాలలో రెండు ప్యాన్లు చోరీకి గురైనట్టు ఎంఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం వల్లంపట్ల క్రాసింగ్‌లో వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కన్పించడంతో విచారించగా బైరాన్‌పల్లిలో చోరీకి పాల్పడిన విషయాన్ని నిందితుడు అంగీకరించారు. ఈ మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

'బాలసదనం'లో నోట్‌బుక్‌ల పంపిణీ



కొండపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండపాక ఆనంద నిలయంలో గల బాలసదనంలో బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ యూత్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ముదుగంటి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాడు. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బాలసదనం ఇన్‌చార్జి రమాదేవి, జిల్లా జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షురాలు తాళ్లపల్లి వెంకటలక్ష్మి, మమత టీచర్లు అశోక్, పాండురంగం రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి గాలం.. బెట్టింగ్ భూతం


(5వ పేజీ తరువాయి)

గంజాయి విక్రయాలు చేస్తూ పోలీసులకు పట్టుబడి, జైలుకు వెళ్లి వచ్చినా, మళ్లీ అదే గుట్టుచప్పుడు కాని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

బెట్టింగ్‌లతో అప్పుల పాలు, ఆత్మహత్యలు

ఈజీ మనీ కోసం దురాశతో యువత ఆన్‌లైన్ రమ్మీ, అందర్-బాహర్ వంటి బెట్టింగ్ గేమ్స్‌కు అలవాటు పడుతున్నారు. లక్షల్లో డబ్బు పోగొట్టుకుని తీవ్ర అప్పుల పాలవుతున్నారు. మత్తుకు బానిసైన కొందరు, ఆ అలవాటును కొనసాగించడానికి అప్పులు చేసి, వాటిని తీర్చే మార్గం లేక బెట్టింగ్‌లకు మళ్లుతున్నారు. ఇలా అప్పుల ఊబిలో కూరుకుపోయి, పోలీస్ కేసుల్లో ఇరుక్కుని, చివరకు ఎలాంటి ప్రత్యామ్నాయం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

యువత కదలికలపై నిఘా పెట్టాలి



గంజాయి తాగుతూ.. రవాణా చేస్తూ పోలీసులకు దాడుల్లో పట్టుబడిన వారిలో 30 ఏళ్లలోపు యువకులు ఉండడం బాధాకరం. యువత కదలికలపై తల్లిదండ్రులతో పాటు ప్రజలు, పోలీసులు పటిష్ట నిఘా పెట్టాలి. గతంలో గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబడిన యువకులపై ప్రత్యేక నిఘా పెట్టి వారు ఏం చేస్తున్నారో పోలీసులు గమనిస్తూ ఉండాలి. ఈ అంశంపై పోలీసులు, మేధావులు, ప్రజలు ప్రత్యేక చొరవ తీసుకుని గంజాయిని కట్టడి చేసేందుకు కృషి చేయాలి.

- జంగం రమేశ్, కాంగ్రెస్ నాయకుడు

తల్లిదండ్రులు పిల్లలపై ఫోకస్ పెట్టాలి



తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ఫోకస్ పెట్టాలి. పిల్లలు రోజు తిరిగే స్నేహితులు ఎలాంటి వారో తెలుసుకోవాలి. చిన్నతనం నుంచే చెడు మార్గం వైపు వెళ్లకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ మధ్యకాలంలో జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడుతున్న వారిలో యువకులు ఉండడం బాధాకరం. ఇది భవిష్యత్తును అంధకారం చేసే విషయం. పోలీసుల భాగస్వామ్యంతో గంజాయిపై పోరాటం చేయాలి.

- పంజాల అశోక్‌గౌడ్, బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



కొత్తూరులో భగవద్గీత ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ములుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ప్రోత్సాహంతో ఆదివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథం, జ్ఞాన ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ గిరి మాట్లాడుతూ భగవద్గీత జ్ఞానం ప్రతీ వ్యక్తికి అత్యవసరమన్నారు. కాబట్టి ప్రతి ఒక్క రూ తప్పక చదివి అందులోని శ్రీ కృష్ణుడి భావాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సీహెచ్ గిరి, ఎన్ఎస్ కుమార్, నర్సింహాచారి, ఎంవీఎన్ రావు, మధు, పారెడ్డి, పవన్, ప్రవీణ్, కుమార్, నాగమణి, పద్మ, శాంతి, శ్రీనివాస్, చంద్రకళ, పద్మ, దివ్యశ్రీ, ప్రియ, భానులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల ముందస్తు అరెస్ట్



వన్ టౌన్ లో అరెస్ట్ అయిన బీజేపీ నాయకులు

సిద్దిపేట క్రైం, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం సిద్దిపేట పట్టణంలో శాంతియుతంగా ఆందోళన చేపట్టాలని నిర్ణయించిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై అభిప్రాయాన్ని వెల్లడించడానికి యత్నించిన కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కెమ్మసారం సంతోష్ ధాబా నరేష్, గాందే సంతోష్, ఎర్ర గణేష్, వెంకట్‌రావు, అరిగే యాదగిరి, కిరణ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు



లక్ష్మీనగర్ స్టేజ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సమతా, పోలీసులు

సిద్దిపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎవరైనా సరే మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని మిరుదొడ్డి ఎస్‌ఐ సమతా హెచ్చరించారు. ఆదివారం మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్ స్టేజ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా వాహన ధ్రువీకరణ పత్రాలను వెంటతెచ్చుకోవడంతో పాటు హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. అలాగే ఫోర్‌వీలర్ డ్రైవింగ్ చేసేటప్పుడు సీటుబెల్టును ధరించాలని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే ఊపేక్షించేది లేదని హెచ్చరించారు.

సైనికుల తల్లిదండ్రులకు ఘన సన్మానం



కట్కూర్‌లో కార్యక్రమానికి హాజరైన సైనికుల తల్లిదండ్రులు

అక్కన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్కూరు గ్రామంలో శ్రీ సత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సైనికుల తల్లిదండ్రులకు దుస్తులను బహూకరించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వందమందికి పైగా యువకులు సైన్యంలో చేరి దేశానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఇందులో శ్రీ సత్య సాయి సేవాసమితి ప్రతినిధులు యమునారాణి, సంధ్యావళి, మాజీ సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భూపతి సుదేష్ణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెన్సీతో చక్కటి భవిష్యత్తు



నవోదయలో వృత్తి మార్గదర్శకత్వంపై మాట్లాడుతున్న పూర్వ విద్యార్థిని రేవతి

వర్గల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చాలామంది మెడిసిన్, ఇంజనీరింగ్ విభాగాలపై ఎక్కువ మక్కువ చూపుతున్నారని, కానీ ఇతర రంగాల్లో కూడా చక్కటి అవకాశాలు ఉన్నాయని వర్గల్ నవోదయ పూర్వ విద్యార్థి రేవతి పేర్కొన్నారు. ఆదివారం వర్గల్ నవోదయ విద్యాలయంలో వృత్తి, మార్గదర్శకత్వంపై పూర్వ విద్యార్థుల సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ మెడిసిన్, ఇంజనీరింగ్‌తో పాటు చార్టెడ్ అకౌంటెన్సీకి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. చార్టెడ్ అకౌంటెన్సీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరిస్తూ చార్టెడ్ అకౌంటెన్సీని ఎంచుకున్న విద్యార్థులు ప్రస్తుతం పెద్ద పెద్ద కంపెనీల్లో రూ.లక్షల్లో వేతనాలు పొందుతురన్నారు. పదవ తరగతి నుంచి ఈ కోర్సు పట్ల విషయ సేకరణ చేస్తూ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్లో చక్కటి ప్రతిభను ప్రదర్శించి వృత్తి నైపుణ్యాన్ని అవవరుచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, సభ్యులు, నవోదయ విద్యాలయం అధ్యాపకులు పాల్గొన్నారు.

పంటనష్టం వివరాలు తెలియజేయాలి

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు వ్యవసాయశాఖ అధికారులు వస్తున్నట్లు ఏవో వేల్పుల పూజా తెలిపారు. రైతుల సంబంధించిన పట్టా పాసుబుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను అధికారులకు అందించాలని తెలిపారు.